క్లుప్తంగా

నారాయణలంకలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



నారాయణలంకలో వైద్య సేవలందిస్తున్న గీతాంజలి

కపిలేశ్వరపురం: పేదలందరికీ ఖరీదైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని అంగర వైద్యాధికారి పి.రత్నకుమారి, వైద్యురాలు జీవీ గీతాంజలి అన్నారు. కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంకలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 63 మందికి వైద్య సేవలందించారు. గ్రామస్తులకు బీపీ, షుగరు, దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలను పరీక్షించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జె.మల్లికార్జునుడు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు



టేకిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టేకి రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన నిర్వహించారు. ఎంటీయూ 3626 బొండాలు రకాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే వీలు లేని నేపథ్యంలో.. రబీలో బొండాలను సాగు చేయవద్దని సూచించారు. ఎంటీయూ 1121 శ్రీధృతి సన్నాలు రకం సాగు చేయడం శ్రేయస్కరమన్నారు. డిసెంబర్ తొలివారంలోగా ఎద వేసే ప్రక్రియనూ, డిసెంబర్ ఆఖరి వారంలోగా నాట్ల ప్రక్రియను పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు.

తొలి దశలో వ్యాధి లక్షణాలను గుర్తించాలి



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: చిన్నారుల్లో తొలిదశలోనే కుష్ఠు లక్షణాలను గుర్తిస్తే, అది వ్యాధి నియంత్రణకు దోహదపడుతుందని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి అన్నారు. కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంక, అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లో చిన్నారుల్లో కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించే సర్వేను పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టారు. ఎస్ఎల్ఈపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ, పాఠశాలలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. పీహెచ్‌సీ ఎంపీఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన బేబి, ఎంఎల్‌హెచ్‌పీ దేవి తదితరులు వ్యాధి లక్షణాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ల నియామకం



సాయిరాం

కపిలేశ్వరపురం (మండపేట): బీజేపీ మండపేట నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది కోటిపల్లి వీవీ సాయిరాం, కో కన్వీనర్‌గా ద్వారపూడి గ్రామానికి చెందిన కంకటాల మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ఉత్తర్వులందినట్టు వారు తెలిపారు. కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడుగా నామాల శ్రీనుని నియమించారన్నారు. వారికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

శంకరనారాయణ మూర్తి నియామకం



శంకరనారాయణమూర్తి

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా తాను నియమితులైనట్టు పార్టీ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ మూర్తి తెలిపారు. దుగ్గుదుర్రులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనను రెండోసారి నియమించిందన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రామచంద్రపురం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశానన్నారు.

దోమపోటు

- గింజ గట్టిపడే దశలో పంటలపై దాడి
- చివరిలో చిక్కులు తెస్తున్న వైనం
- గగ్గోలు పెడుతున్న రైతాంగం
- ఉధృతిని బట్టి మందులు వాడాలంటున్న వ్యవసాయాధికారులు



వరిదుబ్బు మొదలుపై ఆశించిన దోమలు, వ్యాప్తి చెందుతున్న శిలీంధ్రం



కాజులూరులో దోమపోటుకు గురైన వరిపొలం

కాజులూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు తొలి దశ నుంచి పంటలపై తెగుళ్లు రైతన్నలను ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పంట చివరి దశలోనూ వరిపై సుడిదోమ ఆశించి రైతులను కలవరపెడుతోంది.

ఉధృతంగా ఆశిస్తున్న సుడిదోమ

నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో సుమారు 53 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అధిక శాతం పంట గింజ గట్టిపడే దశలో ఉండగా, పలుచోట్ల కోత దశలో ఉంది. నియోజకవర్గంలో పంట గింజ గట్టిపడే దశలో ఉన్న పొలాల్లో పంటపై అక్కడక్కడా మాగుడు తెగులు ఆశించగా, అధిక శాతం పొలాల్లో సుడిదోమ ఆశించినట్టు రైతులు చెబుతున్నారు. కొన్నిచోట్ల పచ్చదోమ ఆశిస్తుండగా, ఎక్కువగా పొలాల్లో తెల్లదోమ, గోధుమ రంగు దోమలు వరి మొక్కలను నాశనం చేస్తున్నాయి. తెల్లదోమ, గోధుమరంగు దోమలు మొక్క మొదలును ఆశించి, పిండి పదార్థాలను పీల్చి.. శిలీంధ్రాలను వ్యాప్తి చేస్తాయి. ఈ శిలీంధ్రం వల్ల మొక్క చనిపోతుంది. పంట చివరి దశలో ఉంది కదా అని రైతులు అశ్రద్ధ చేస్తే.. దోమ ఆశించిన స్థలంలో పంట సుడులు సుడులుగా కాలిపోయినట్టుగా తయారై తీవ్ర నష్టం కలుగుతోంది. పంటను రక్షించుకునేందుకు అవసరానికి మించి ఎరువులు ఉపయోగించటం అధిక వ్యయానికి గురి చేస్తుందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ పేర్కొన్నారు. రైతులు ఖరీదైన మందును పిచికారీ చేసే ముందు దోమ ఉధృతిని గమనించి, అందుకనుగుణంగా మందులు పిచికారీ చేయాలని చెప్పారు.

ఎప్పుడు ఏ మందు వాడాలంటే..

వరి దుబ్బు మొదలులో 20 నుంచి 25 దోమలున్నట్టు కంటపడితే.. బూప్రొఫెజిన్ (అప్‌లాండ్) 1.6 మి.లీ. లేదా ఇమిడోక్లోప్రిడ్, ఇదిప్రోల్ (గ్లామోర్) 0.25 మి.లీ., లేదా డైనోటోఫిరాన్(ఓషి న్‌టోకిష్) 0.4 గ్రాములు, పైమెట్రిజిన్ (చెస్) 0.6 గ్రాములను లీటరు నీటిలో కలిపి, 200 లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై వారానికి రెండుసార్లు పిచికారీ చేయాలి. వరి దుబ్బు మొదలులో 100 నుంచి 200 దోమలున్నట్టు గమనిస్తే, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇథోపెన్‌పాక్స్ (న్యూకిల్) 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని వారానికి రెండు సార్లు ఎకరం పంటపై పిచికారీ చేయాలి. వరి దుబ్బుకు 200 పైబడి దోమలున్నట్టు గమనిస్తే, పెనోబుకార్బ్ (బిప్‌విన్) 2 మి.లీ. లేదా మోనోక్రోటోపాస్ రెండు మి.లీ. లేదా డైక్లోరోవాస్ (నూవాన్) ఒక మి.లీ.ను లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయాలి.

దోమపోటు ఆశిస్తే పంట బుగ్గిపాలే..

వరి పంటపై దోమపోటు ఆశిస్తే పంట బుగ్గిపాలవుతుంది. దోమ ఆశించిన చోట పంట సుడులుసుడులుగా ఎండిపోయి, కాలిపోయినట్టుగా తయారవుతుంది. ఆ ప్రాంతంతో పంట కోత కోసినా దిగుబడి రావటం కష్టం.

– సువ్వారి గోవిందు, రైతు, తర్లంపూడి



కొద్దిరోజుల్లోనే పొలమంతా వ్యాపిస్తుంది

దోమపోటు ఆశిస్తే కొద్దిరోజుల్లోనే అది పొలమంతా వ్యాపిస్తుంది. ఖరీదైన మందులు వాడితే కానీ అదుపులోకి రావటం లేదు. దీంతో ఆర్థికంగా రైతులకు భారం పడుతోంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు, మొగలిపాలెం



21న అన్నాభిషేకం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21న అన్నాభిషేకం సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయవరం: మాచవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 6–8 తరగతులకు జూనియర్, 9, 10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్టు లైబ్రేరియన్ టి.ప్రమీల తెలిపారు. జూనియర్స్‌లో గ్రామీణ వాతావరణం, సీనియర్స్‌లో నెహ్రూ చిత్రపటాన్ని విద్యార్థులకు పోటీ అంశంగా ఇచ్చినట్టు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



తర్లంపూడి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది, రైతులకు సూచనలిస్తున్న ఏఓ అశోక్

కాజులూరు: రైతుల కోసం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి, ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తర్లంపూడిలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, ధాన్యం మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.1,637కి కొనుగోలు చేస్తున్నామన్నారు. బయట మార్కెట్‌లో కొందరు దళారులు రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకు ధాన్యాన్ని పట్టుకుపోతున్నారని చెప్పారు. రైతులు వారి మాటలకు మోసపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరాల బాలరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ చైర్మన్ సువ్వారి గోవిందు, పెంకే వెంకటరమణ పాల్గొన్నారు.

సామాన్యుల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అద్దంకివారిలంకలో గ్రామస్తుల సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అద్దంకివారిలంకలో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వివరించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావుతో గ్రామాభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సఖిలే సత్యనారాయణ, పార్టీ నాయకులు నక్కా సింహాచలం, మానేపల్లి ఏడుకొండలు, సఖిలే ఏడుకొండలు, కర్రి రాజు, వందే త్రిమూర్తులు, గొలకోటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై శాస్త్రీయ అవగాహన అవసరం



మండపేటలో విద్యార్థులకు నైపుణ్య అంశాలను వివరిస్తున్న వెంకటరమణ

కపిలేశ్వరపురం (మండపేట): సమాజంలోని వాస్తవికతపై అవగాహన కోసం జీవితాన్ని శాస్త్రీయంగా విశ్లేషించుకోవడం అవసరమని కాకినాడకు చెందిన సత్య స్కాన్ డయోగ్నస్టిక్ సెంటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ (హెన్) సంస్థ ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాదా వెంకటరమణ మాట్లాడుతూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితానికి దశ, దిశ నిర్దేశితమవుతాయన్నారు. చదువుతో పాటు అనుబంధంగా క్రీడలు, జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకుని, జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన రూ.50 వేల విలువైన పుస్తకాలను విరాళంగా సమకూర్చుతానని డాక్టర్ కాదా వెంకటరమణ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిలాల్ ఎ.ఆనందరావు, అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్, జె.నెహ్రూనాయక్, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎంవీఆర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

కురకాళ్లపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



కురకాళ్లపల్లిలో బుక్‌లెట్ అందిస్తున్న సర్పంచ్ శారద, శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు

రాయవరం: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతూ సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావడం కోసం అందరూ అండగా నిలుద్దామని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. కురకాళ్లపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పిల్లి శారద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏం చేశామో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసే ధైర్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించారన్నారు. అనంతరం సర్పంచ్ శారద గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. గురువారం రాత్రి గ్రామంలో పల్లె నిద్ర చేశారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ, పార్టీ నేతలు పిల్లి ప్రసాద్, వాసంశెట్టి సూర్యనారాయణ, ఇళ్ల తలుపులమ్మ, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు అండగా ఏపీఎన్ఆర్‌టీఎస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ బృందం

రాజోలు: గల్ఫ్ బాధితులకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) అండగా నిలుస్తుందని డిప్యూటీ డైరెక్టర్ కరీం అన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏపీఎన్ఆర్‌టీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. సీఐ గోవిందరాజు మాట్లాడుతూ ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధి ధ్యేయంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్ఆర్‌టీఎస్ సేవలు అందిస్తోందన్నారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లే కార్మికులు గుర్తింపు లేని సంస్థలు, ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. గల్ఫ్‌లో ఇబ్బందులు పడే కార్మికుల సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా 08863 2340678 హెల్ప్ లైన్ నంబర్, 8500027678 వాట్సాప్ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సందడి లేక నేతల్లో నైరాశ్యం

టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం తీరు



సమావేశంలో నేతలు వేదికపై ఉండగానే ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం వెంకటాయపాలెంలోని సాయిమాధవానంద కల్యాణ మండపంలో ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జిలు రెడ్డి సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశం 3 గంటలకు నిర్వహిస్తామని నాయకులు ప్రకటించారు. ఈ సమావేశానికి కార్యకర్తలు ఎవ్వరూ చేరుకోకపోవడంతో నాయకులు వారికోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ఇరు పార్టీల కార్యకర్తలతో చాలా సందడి నెలకొనాల్సి ఉండగా, సుమారు 200 మంది మాత్రమే కార్యకర్తలు వచ్చారు. దీంతో ఆయా పార్టీల నాయకుల్లో నైరాశ్యం కనిపించింది. సమావేశంలో నాయకుల ప్రసంగాలు పూర్తి కాకుండానే, వచ్చిన ఆ కొద్దిమందిలోనూ చాలావరకు వెళ్లిపోవడంతో నాయకులను ఖాళీ కుర్చీలు వెక్కిరించాయి.

నాగయ్యా.. నాగరాజా..

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



పసలపూడిలో పోలమ్మ పుట్ట వద్ద నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో నాగేంద్రునికి పూజలు చేస్తున్న భక్తులు



కుడుపూరులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అంగరలో నాగదేవతకు పూజ చేస్తున్న దృశ్యం

రాయవరం: దీపావళి తర్వాత వచ్చే నాగుల చవితి పర్వదినాన్ని శుక్రవారం మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. నాగయ్యా.. నాగప్పా.. నాగరాజా అంటూ వేకువజాము నుంచే భక్తులు పొలాలు, తోటల వద్ద ఉన్న పాముల పుట్టల వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిన్నాపెద్దా అంతా పుట్టల వద్ద దీపారాధన చేసి, నాగదేవతకు నైవేద్యాలను సమర్పించారు. కొందరు భక్తులు తమ చిన్నారులను పుట్ట వద్దే కూర్చోబెట్టి, వారి తలపై బూరెలు ఎగరేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం పుట్ట వద్ద బాణసంచా కాల్చారు. పాముల పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. ఇటీవల కాలంలో పుట్టలు కనుమరుగవుతుండడంతో భక్తులు వాటిని వెతికేందుకు అవస్థలు పడ్డారు. సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు బారులు తీరారు. మండలంలోని లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గ్రామాల్లో నాగుల చవితి సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, టేకి, మాచర, కాలేరు, నల్లూరు, కోరుమిల్లి, వాకతిప్ప తదితర గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి సందడి నెలకొంది. పుణ్య స్నానాలను ఆచరించి వ్యవసాయ క్షేత్రాల్లోని పాము పుట్టల్లో పాలు, చిమ్మిలి తదితర పదార్థాలను వేసి నాగదేవతకు పూజ చేశారు. చిన్నారులు నూతన వస్త్రాలను ధరించి, టపాసులు పేల్చుతూ సందడిగా గడిపారు.

మండపేటలోనూ..

ద్వారపూడి, ఏడిద, మెర్నిపాడు, పాలతోడు, వెలగతోడు, కేశవరం, అర్తమూరు తదితర గ్రామాల్లో నాగుల చవితి పూజా కార్యక్రమాలను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణ ప్రజలు గ్రామాలకు వెళ్లి.. పుట్టల్లో పాలుపోసి పూజలు చేశారు.

పుట్టల వద్ద ప్రత్యేక పూజలు

కె.గంగవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి పండగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన కె.గంగవరం, పామర్రు, యర్రపోతవరం, మసకపల్లి, కోటిపల్లి, కూళ్ల గ్రామాల్లోని పొలాల్లో ఉన్న పుట్టలను సుందరంగా అలకరించారు. స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పుట్ట వద్దకు చేరుకుని, గుడ్లు, పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువకులు బాణసంచా కాల్చారు. యండగండి గ్రామంలో సిమెంట్‌తో తయారు చేసిన పుట్ట వద్ద గ్రామస్తులు పూజలు చేశారు.

మొక్కులు తీర్చి.. బాణసంచా కాల్చి...

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో నాగుల చవితిని శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని 27 వార్డులు, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో భక్తులు పొలాలు, తోటల్లోని పాము పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టల్లో పాలు, గుడ్లు, తేగలు వంటివి వేసి మొక్కులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంతో పాటు నియోజకవర్గంలోని అనేక శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం



పామర్రులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



రామచంద్రపురం గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

కె.గంగవరం: గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞాన మార్గంలో నడిపించే మార్గదర్శకాలని హెచ్‌యం పితాని శ్రీనివాస్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పామర్రు హైస్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఎస్.గంగాధర్, ఉపాధ్యాయులు అంజిబాబు, సుజాత, హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ప్రతిభా పోటీలు

కపిలేశ్వరపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ దానేటి శివకుమారి ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. మొత్తం 42 మంది పాల్గొన్నారని, విజేతలకు వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు ఇస్తామని ఆమె తెలిపారు.

చిన్నారులకు క్విజ్, చిత్రలేఖనం

రామచంద్రపురం: పట్టణంలోని రామచంద్రపురం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం చిన్నారులకు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుమారు 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు ఇస్తారని లైబ్రేరియన్ దడాల వెంకటరమణ తెలిపారు.

బాలిక అదృశ్యం

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఈ సంఘటనపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.